# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 10 సెప్టెంబర్ 2024


## నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**చాపాడు, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**



మండలంలోని వినాయక నిమజ్జనం జరిగే ప్రదేశం సీతారాంపురం కుందూ నది వద్ద సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలలో పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటుచేయాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాలలో చిన్న పిల్లలను తీసుకెళ్లకూడదని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ శివశంకర్, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య, డిప్యూటి తాసిల్దార్ యామిని, ఈఓపిఆర్డి రాధాకృష్ణ వేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పులివెందుల సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు

**పులివెందుల, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :**



పులివెందులలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టరు శివశంకర్ లోతేటి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి ఆసుపత్రి, టీచింగ్ హాస్పిటల్‌లో మౌలిక సదుపాయాలు, ఓపీ, ఐపి బ్లాకులు, ఎమర్జెన్సీ వార్డులతో పాటు పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఏపీ ఎంఎస్ఐడీసి కల్పించే సదుపాయాలు, వైద్య సిబ్బంది, తదితర విషయాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అందుతున్న వైద్యసేవల గురించి రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుని లడ్డువేలం పాట

**రూ.99వేలు పలికిన లడ్డూ ధర**

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 9 (ప్రభాతవార్త):**



పట్టణంలోని నెల్లూరురోడ్డు, ఆంజనేయనగర్ కొండారెడ్డి వీధిలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకుని మూడు రోజు ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన లడ్డూ వేలం పాటకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటను మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్ మాలే రామచంద్రారెడ్డి తల్లి మాలే సుబ్బమ్మ 99వేలకు దక్కించుకోగా, చెరుకుగడలు 7 వేలకు బ త్తల వెంకటసుబ్బయ్య, హుండిని 6 వేలకు శివారెడ్డి, కుంకుమ భరిణను 18వేలకు పెద్దిరెడ్డి బుజ్జమ్మ, కలశపు వెండి చెంబును 45 వేలకు దివాకర్‌రెడ్డిలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు మేక సుబ్బరాయుడు, చింతంరెడ్డి రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

# రాజంపేట ఇసుక క్వారీ పర్మిట్ల జారీలో గోల్‌మాల్

**మూడు రోజులుగా ఒకే వ్యక్తికి 450టన్నుల ఇసుక**

**మైనింగ్ ఏడి ఒత్తిడితో పర్మిట్లు : కూచివారిపల్లెలో పర్మిట్ల జారీలో తోపులాట**

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లాలో ఇసుక సరఫరా పారదర్శకంగా జరగాలని జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించిన రోజు నుంచే మైనింగ్ అధికారులు దందాకు తెరతీశారు. మైనింగ్ ఏడీ చెప్పారంటూ ఓబుళవారి పల్లె మండలం రాసపల్లెకు చెందిన ఒకే వ్యక్తికి గత మూడు రోజులుగా 450మెట్రిక్ టన్నులకు ఇసుక పర్మిట్లను జారీ చేసినట్లు తెలిసింది. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు కలిపి రాజంపేట మండలం రాయచోటి రోడ్డులోని కూచివారిపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో పర్మిట్లు జారీకి సచివాలయ సిబ్బంది ప్రత్యేకంగా నియమించారు. ప్రతిరోజు ఓబుళవారి పల్లె మండానికి చెందిన టీడీపీ నేత ఉదయాన్నే వచ్చి కూర్చొని పర్మిట్లను పెద్దఎత్తున తీసుకువెళ్తున్నాడు. కార్యాలయం లోపల అతన్ని కూర్చోబెట్టి పర్మిట్లు జారీ చేస్తున్నారు. మిగతా వారికి పర్మిట్లు అందేలోపే కేటాయించిన పరిమాణం మేరకు అయిపోయిందని సిబ్బంది చెబుతున్నారు. ఫలితంగా సోమవారం పర్మిట్ల జారీలో ఇసుక కోసం వచ్చిన వారి మధ్య తోపులాట జరిగింది. పర్మిట్లు దక్కించుకునేందుకు ముందు జాగ్రత్తగా ఏర్పాటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయం వద్ద కేవలం ఒక హోం గార్డును మాత్రమే నియమించారు. దీంతో అక్కడ ఒక్కరే కంట్రోల్ చేయడం ఇబ్బందికరంగా మారింది. ఒకరికే వందల టన్నుల ఇసుక ఎలా ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పారదర్శకంగా ఇసుక సరఫరా చేయడమంటే ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా సుమారు 500టన్నుల ఇసుక పర్మిట్లు పొందిన వ్యక్తి రైల్వేకోడూరులో బ్లాక్‌లో పెద్దఎత్తున ధర పెంచి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలాంటి



విధానాలకు జిల్లా కలెక్టర్ చెక్ పెట్టాలని పర్మిట్ల కోసం వచ్చిన వారు విజ్ఞప్తి చేశారు.

## బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 09 ప్రభాతవార్త :**



బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసుస్టేషన్ పరిధిలోని గణేష్ విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పోలీసులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం ప్రాంతాలలో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే నిమజ్జన ప్రాంతంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, బారికేడ్లు ఏర్పాటుచేయాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తదితర ఆదేశాలు జారీ చేశారు. అంతేగాక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు కృషిచేయాలన్నారు. ఎస్పీ వెంట మైదుకూరు డిఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చంద్రశేఖర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి : సబ్‌కలెక్టర్

**మదనపల్లె, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**



ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని పలువురు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతలు అందజేశారు. సోమవారం సబ్‌కలెక్టర్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేధికలో రెవెన్యూ సమస్యలపైనే ప్రధానంగా ఫిర్యాదులు అందాయి. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న 4.15ఎకరాల భూమిని పత్తేపురంకు చెందిన లక్ష్మిదేవమ్మ వెంకటరమణలు రాజకీయ అండతో ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. వాల్మీకిపురంకు చెందిన ఓబుళంపల్లెకు చెందిన నీరుగట్టు బాలసుబ్రమణ్యం ఫిర్యాదు చేశారు. ముదివేడు గ్రామ రెవెన్యూ దాఖలాల్లోని రెడ్డివారిపల్లెకు చెందిన వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి, రిజిస్టర్ చేసుకొన్న భూమిని, ఎలాంటి హక్కులు, అధికారిక పత్రాలు లేని రెడ్డివారిపల్లెకు చెందిన తిమ్మారెడ్డిగారి రమణారెడ్డి తనకు భాగం ఉందని చెపుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నాడని, రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించాల్సిందిగా మదనపల్లె ఎస్‌బిఐ కాలనీకి చెందిన గంగిరెడ్డి అర్జీ సమర్పించారు. వినతలు స్వీకరించిన సబ్‌కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ప్రశాంతంగా వినాయక నిమజ్జన వేడుకలు

**దువ్వూరు, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వినాయక చవితి పండుగ సంధర్భంగా ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాలను సోమవారం నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించి స్థానిక పోలీస్ సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. దీంతో ఇడమడక, కానగూడూరు, రాంసాయి నగర్, దువ్వూరు, తెలుగు గంగ రిజర్వాయర్, భీమునిపాడు వద్ద స్థానిక రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు. వినాయక విగ్రహాలను ట్రాక్టర్‌లలో ఊరేగిస్తూ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాణాసంచా పేలుస్తూ నిమజ్జన వేడుకలకు బయలుదేరారు. మండలంలోని 116వినాయక విగ్రహాలలో సోమవారం నాడు సుమారు 92విగ్రహాలను నిర్వాహకులు నిమజ్జనం చేశారు. నిమజ్జన కేంద్రాల వద్ద నీటిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ మధురవాణి కూడ సలహా ఇచ్చారు. తహసీల్దార్ నిమజ్జన ప్రదేశాల వద్ద వీఆర్ఓలను ఏర్పాటుచేశారు. మండలంలో సోమవారం ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు పూర్తి అయ్యాయి.

# అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**రాయచోటి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీను పరిష్కరించడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదు. బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) తరచుగా తమ శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు వస్తాయి, దాని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి, అది ఏ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందది, దరఖాస్తుదారులతో మాట్లాడాలి, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. ఇందుకు నిర్దిష్ట కాల పరమితి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఒక వేళ కోర్టు పరిదిలో ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకోవడం చేయాలి. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలి. పెండింగ్ దరఖాస్తులు రీ ఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సీఎం మరియు ఉప ముఖ్యమంత్రి లాగిన్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

# గణపయ్యా....ఇక సెలవు



**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 9 (ప్రభాతవార్త):**

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా పలు ఏరియాలలో గత మూడు రోజులపాటు నిర్వహించి సోమవారం ఇక సెలవయ్యా గణపయ్యా అంటూ సోమవారం 70 శాతం వినాయకులను నిమజ్జనానికి తరలించారు. ఈ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అర్బన్ సీఐ రాజగోపాల్ ఆదేశాల మేరకు ఎస్ఐ సత్యనారాయణ, తమ పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు మున్సిపాలిటీలోని పలు వీధులలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు సోమవారం సాయంత్రం నుంచి వరుసగా నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఎస్ఐ సత్యనారాయణ నిరంతరాయంగా పర్యవేక్షించారు.

### వినాయకుని లడ్డూ దక్కించుకున్న యల్లారెడ్డి

అట్లూరు మండలం, దుత్తాయపల్లె గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం వినాయకుని వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని పల్లెం యల్లారెడ్డి, సతీమణి యల్లమ్మ కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. వారికి గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాల, స్వామివారి వస్త్రంతో సత్కరించారు. అలాగే మున్సిపాలిటీపరిధిలోని 16వ వార్డులో గత మూడు రోజులపాటు ఉత్సవ కమిటి సభ్యులు నిమ్మకాయల శివారెడ్డి, పెంచలరెడ్డి, బాలిరెడ్డి, పీరయ్య, సిద్దయ్య, మల్లికార్జునరెడ్డి, హజరత్, మహేంద్ర, హరితో పాటు పలువురు కమిటి సభ్యుల ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని నిమజ్జనానికి తరలించారు. స్వామివారి లడ్డు ప్రసాదాన్ని కుమారి 36వేలతో దక్కించుకున్నారు. స్వామివారి వద్ద ఉంచి పలు ప్రసాదాలను పలువురు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది

వార్త 2 లో...

## అట్టహాసంగా వినాయకస్వామి విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం

**కేరళ వాయిద్యాలతో దద్దరిల్లిన పట్టణం**





**పీలేరు, సెప్టెంబరు 09 ప్రభాతవార్తః**


పట్టణంలో వినాయకస్వామి విగ్రహాలు ఊరేగింపు నిమజ్జన కార్యక్రమాలులో భాగంగా ప్రజలు అత్యధిత సంఖ్యలో విగ్రహాల ఊరేగింపు కోలాహలంగా జరిగాయి. సోమవారం గణేష్ నిమజ్జనం స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి లాంచనంగా ఆనవాయితీ ప్రకారం మొదటి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పురవీదులలో నెలకొల్పిన ఉత్సవ విగ్రహాలను వాటి నిర్వాహకులు వరుసక్రమంలో ప్రత్యేక వాహనాలపై ఊరేగింపు కార్యక్రమంలోకి తీసుకువచ్చారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఏర్పాటుచేసిన కేరళ వాయిద్య బందాలు సాంస్కతిక కార్యక్రమాలు డీజే సౌండ్ సిస్టమ్‌లతో, టపాకాయల మోతలతో పట్టణం మారుమ్రోగింది. స్థానిక పోలీసులు విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ పట్టణంలోని పంచాయతీ మిట్ట వద్ద స్వాగత వేదికను ఏర్పాటుచేశారు. అలాగే పట్టణ శివారులోని అయ్యప్పనాయుని చెరువులో విగ్రహాల నిమజ్జనం కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తూ క్రేన్లను సమకూర్చింది. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘం, వర్తక వ్యాపార సంఘాలు ఊరేగింపులో పాల్గొన్న వారికి అల్పాహారం, శీతలపానీయాలు, మజ్జిగ , మంచినీరు అందించారు. వినాయక ఉత్సవ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను నాలుగురోడ్ల కూడలి నుంచి, కోటపల్లె సర్కిల్ నుంచి ట్రాఫిక్ మళ్లించి నిమజ్జనానికి సుగమనం చేశారు. వినాయకస్వామి విగ్రహాలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తమీర పంటతో లాభాలు

**- కొత్తిమీర కట్ట రూ.50 - 40రోజుల్లో పంట చేతికి రావడంతో సాగుపై మక్కువ**

**రామసముద్రం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**

ప్రస్తుత సీజన్‌లో రైతన్నకు గడ్డుకాలం ఎదురైంది. పండిన అరకొర పంటకు గిట్టుబాటు ధరలేదు. మరికొన్ని చోట్ల సాగు చేసిన పంటలకు సాగునీరు లేక ఎండిపోయాయి. రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. అయితే కరువు పరిస్థితుల్లో కొత్తిమీ సాగ రైతన్నలకు అశాజనకంగా కనిపిస్తొంది. నియోజకవర్గంలోని రామసముద్రం మండలంలో పలు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఈ పంటను పండించి లాభపడుతున్నారు. చుట్టూ ప్రక్కల గ్రామాల్లో సుమారు 500ఎకరాల వరకు ఈ పంటను సాగు చేస్తున్నట్లు తెలుస్తొంది. కొత్తిమీర పంట కేవలం 40రోజుల్లోనే చేతికి అందుతుండడంతో సాగునీరు ఉన్న రైతన్నలు ఎక్కువ మంది కొత్తిమీర సాగుపట్ల మక్కువ చూపుతున్నారు. ఇప్పుడు మార్కెట్‌లో కొత్తమీర కట్ట రూ.50లు పలుకుతోంది. కొత్తమీర పంటను హైదరాబాద్, మహబూబ్‌నగర్, కర్నాటక రాష్ట్రంలోని బళ్ళారి, రాయచూరు, చెన్నై తదితర రాష్ట్రాలకు ఎగుమతి అధికంగా ఉంటుంది. కొత్తిమీర పంట ఆశాజనకంగానే ఉంది. పంటకు ప్రస్తుతం కొద్దోగొప్పో గిట్టుబాటు ధర పలకుతుండడం విశేషం. పశ్చిమాన టమోటా పంట అధికంగా వేశారు. పంట బాగా దిగుబడి వచ్చి ధరలు పెరిగినా ఆశాజనకంగా ఉన్న కొత్తిమీరను కూడా వేయడంతో కొత్తమీర సాగు మాత్రం కాసులు కురిపిస్తోంది. ఈ పంట ద్వారా వస్తున్న ఆదాయంతో రైతన్నలు కొంత ఊరట చెందుతున్నారు. ఈ పంట సాగు చేయాలంటే ఒక ఎకరా పంటకు పెట్టుబడి రూ.20వేలు నుంచి 25వేల వరకు ఉంటుందని రైతన్నలు



చెబుతున్నారు. విత్తనాలకు రూ.10వేలు, ఎరువులు కలుపుతో పాటు ఇతర పెట్టుబడులకు రూ.10వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. ఒక ఎకరంలో 80నుంచి 100మళ్లు ఉంటాయి. పంట చేతికి 40రోజుల్లో అందుతుందని దీంతో పంటసాగుకు కొంత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రైతులు లాభపడుతున్నారు. కొత్తిమీరకు ధర భాగా ఉంది. కొత్తిమీర పంటకు ధర భాగా ఉంటే ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

# చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది

– పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి



**కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా పాలన చేశారని నీతి, నిజాయితీ, చట్టబద్ధత, పారదర్శకత చంద్రబాబు ప్రత్యేకత అని అందుచేతనే చంద్రబాబు అక్రమ అరెస్టు చేస్తే అన్ని వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరూ ఖండించారని రాష్ట్ర టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. సెప్టెంబరు 9కి ఆయన అక్రమ అరెస్టుకు ఏడాది అయ్యిందని 53 రోజుల పాటు జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేశారని ఆయన గుర్తు చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో లూటీలు, నేరాలు, కక్షలకు, కార్పన్యాలకు కాలం వెలిబుచ్చితే కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా మందుకెళ్తోందని ఆయన తెలిపారు.

# పురిటి పిల్లలకు అత్యాధునిక చికిత్స

**కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
కడప నగరంలోని స్థానిక నాగరాజుపేటలో ఇషాన్ ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా డా.సి.ఓబుల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇషాన్ ఆసుపత్రిలో పురిటి పిల్లలకు, బరువు తక్కువ నెలలు తక్కువ పిల్లలకు ప్రత్యేక వైద్య సదుపాయం కలదని డెంగీ జ్వరాలకు పురిటి పిల్లలకు ఆపరేషన్ సౌకర్యం ఉందని ఆయన తెలిపారు. కడప జిల్లా ప్రజలకు మిత్రులకు మా ఆసుపత్రి సిబ్బందికి తమ ఆసుపత్రిని ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# జై..భోలో గణపతి మహరాజ్‌కే..జై



**రామసముద్రం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**
రామసముద్రం మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. వినాయక చవితి పండగ మూడురోజులు అయిన సందర్భంగా పలు పంచాయితీల్లోని గ్రామాల్లో వినాయకున్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. వినాయకుని నిమజ్జనంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పోలీస్‌బందోబస్తు నిర్వహించారు. మండలంలోని తిరుమలరెడ్డిపల్లె, మినికి గ్రామీణ ప్రాంతాల్లో వైభంగా వినాయకుని ఊరేగింపు నిర్వహించారు. బజారువీధిలోని ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో వినాయకస్వామి కేరళ వాయిద్యాల మద్య గొప్ప ఊరేగింపు యువకులు మహిళలు, రంగులు చల్లుకొని సంతోషంగా వినాయకుని నిమజ్జనం చేశారు. తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో పెద్ద దామోదర్‌రెడ్డి గౌతమి దంపతులుచే భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలుజరగకుండా ఎస్ఐ చంద్రశేఖర్ గట్టిబందోబస్తు నిర్వహించారు. అనంతరం చెరువుల వద్దకు తీసుకెళ్లి వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు.

# 12, 13న మండల స్థాయి క్రీడా పోటీలు

**చిట్వేలి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) క్రీడా పోటీలు సెప్టెంబరు 12, 13 తేదీల్లో చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆతిథ్యం ఇవ్వనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు కోదండ నాయుడు, ఈశ్వరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డిలు తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్, చెస్ తదితర ఏడు అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూల్లో, హైస్కూల్‌లో ప్లస్‌లలో చదివే ఇంటర్ విద్యార్థులు నేరుగా జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల పీడీ, పీఈటీలు అర్హత గల క్రీడాకారుల జాబితా, మధ్యాహ్న భోజన అటెండెన్స్ ఫామ్స్ వెంట తీసుకొని రావాలని సూచించారు.

# పలు గ్రామాల్లో వినాయకుని నిమజ్జనం

**రామాపురం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**



మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లెలో మండల కేంద్రమైన రామాపురంలో చిట్లూరు పంచాయతీ చేనిక్కాయలపల్లెలో నల్లగుట్టపల్లి తదితర గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనాలు కమిటటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి భావంతో పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు. కొత్తపల్లిలో ఈసారి లడ్డు వేలం పాటు బండారు శ్రావణ్‌కుమార్ రూ.31వేలకు, అలాగే ఐదు రూపాయల బిల్లకు మదినేని విజయ్, లోకేష్‌లు రూ.12వేలకు పాడి దక్కించుకున్నారు. చెరుకకు వేలం పాట రూ.5201లకు వెంకటేష్ పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలిశెట్టి చంద్రమౌళి, రేఖం నారాయణ, ఆంజనేయులు, రాజశేఖర్, రాజా, బండారు తిమ్మారెడ్డి, రవి, లక్ష్మీనారాయణ, బాబు, రమేష్, వెంకట రమణ, లక్ష్మయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనం ఊరేగింపులో డీజేల హోరు తగ్గడంతో తగ్గిన శబ్ద కాలుష్యం

**కడప క్రైం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జనంలో డీజేల హడావుడి లేకపోవడంతో ఊరేగింపు ప్రశాంతంగా జరుగుతోంది. గతంలో జరిగిన నిమజ్జనంలో డీజేల హోరుకు శబ్ధ కాలుష్యంతో ప్రజల చెవులు చిల్లులు పడేలా లౌడ్ స్పీకర్లు నుంచి వచ్చే ధ్వనులతో ఇబ్బందులు పడేవారు. శబ్ధ కాలుష్యానికి తావులేకుండా ఈ ఏడాది జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేపట్టిన చర్యల పట్ల జిల్లాలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించి నిబంధనల మేరకు వ్యవహరించడం పట్ల ప్రజలు పోలీసుకు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక నిమజ్జనానికి చెరువులను పరిశీలిస్తున్న ఎస్సై



**రామాపురం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో వినాయక చవితి పండగ సందర్భంగా ఆయా గ్రామాలలో వినాయక కమిటీ సభ్యులు వినాయక విగ్రహాలను గ్రామాలలో ఏర్పాటు చేశారని విగ్రహం నిమజ్జనం గ్రామ శివార్లలో ఉన్న చెరువులను సోమవారం ఎస్సై వెంకట సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. నిమజ్జనం చేసేసమయంలో చిన్న పిల్లలు చెరువు వద్దకు రాకూడదని, బొమ్మల కింద ఎవరూ ఉండకూడదన్నారు. ఊరేగింపు చేసేటప్పుడు కమిటీ సభ్యులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

# గర్భవతులకు అన్నదానం

**వీరబల్లి, సెప్టంబర్09,ప్రభాతవవార్త :**



మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో పియంయస్ఎంఏ కార్యక్రమాలలో భాగంగా సోమవారం గర్భవతులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరంగర్భవతులకు బాలింతలకు ప్రతి నెల నిర్వహించే పరీక్షలు చేశారు. వచ్చిన వారికి మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాధ రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమమంలో విఆర్‌డియస్ సురేంద్ర రెడ్డి, బాలింతలు, గర్భవతులు, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు ఇలియాస్ బాష



**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు తాలుకా స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు ఉప్పలూరు ఇలియాస్ బాష తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రొద్దుటూరు తాలుకా స్వర్ణకారుల సంఘం సభాభవన్‌లో నూతన అధ్యక్షులుగా ఆయన ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘం 1969లో ఏర్పాటుచేశారన్నారు. అప్పటి నుండి అధ్యక్షులుగా పనిచేసిన ప్రతి ఒక్కరూ సంఘం అభివృద్ధికి, స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. ప్రధానంగా ప్రొద్దుటూరు తాలుకా శాఖలో 3800 మంది స్వర్ణకారులు ఉన్నారని అన్నారు. నూతనంగా తనను అధ్యక్షులుగా ఎన్నుకున్న స్వర్ణకార సభ్యులందరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వర్ణకారులకు ఏ సమయంలోనూ ఎలాంటి సమస్య వచ్చినా పెద్దలతో కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కార్యదర్శిగా వీరయ్య, కోశాధికారిగా మౌలాలి ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఐదు మంది కార్యదర్శులుగా ఐదు మంది ప్రమాణం చేశారు. అనంతరం 56మంది పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సంధర్భంగా సంఘ సభ్యుల సంక్షేమానికి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షరాబు వ్యాపారుల సంఘం అధ్యక్షులు కొప్పర్తి మధుసూధన్ రావు, స్వర్ణకారుల సంఘం మాజీ అధ్యక్షులు ఉప్పర మురళీ మరియు పెద్దఎత్తున స్వర్ణకార సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై తాసిల్దార్‌కు ఎంపీజే వినతి



**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**
మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ తరపున రాష్ట్ర వ్యాప్తంగా వైద్య మరియు ఆరోగ్య సమస్యలపై సెప్టెంబర్ 1 నుంచి 15వ తేది వరకు ఉద్యమాన్ని నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య శ్రీ ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు, గ్రామీణ, ఏరియా, హాస్పిటల్స్‌లో రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ అర్హులైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మరియు మెరుగైన సేవనలు అందించాలని ప్రజల జీవితాలను, ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసే మద్యపాన నిషేధం, స్త్రీలపై అత్యాచారాలకు కారణమౌతున్న అశ్లీల వెబ్‌సైట్‌లు, గంజాయి, డ్రగ్స్‌ను నిషేధించాలి, పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్లలో పరిశుభ్రతను పాటించేలా మరియు మౌళిక సదుపాయాలను కల్పించేలా రాష్ట్రంలోని మెడికల్ షాపులలో నిషేధిత, ఎక్స్‌పైర్ యిన మందుల విక్రయాలను జరిపే వారిపై సంబంధిత డ్రగ్స్ ఇన్స్‌స్పెక్టర్లును నిఘా ఉంచాలని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటల్స్, స్వీట్, బేకరి షాప్‌లపై, కాలంచెల్లిన తినుబండారాలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పరిశీలించి చర్యలు తీసుకునేలా ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్ లను నిఘా ఉంచాలని, రైతు ఆత్మహత్యలక కారణం అవుతున్న నకిలీ విత్తనాలు, మందులు అమ్మేవారి పట్ల కఠిన చర్యలు తీసుకునేలా వ్యవసాయ అధికారులను జాగృతి చేసి అలాంటి షాపులపై చర్యలు తీసుకోవాలని పై సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ద్వారా స్థానిక తహసీల్దార్ కృషి చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాష, కార్యదర్శి మహమ్మద్‌రఫీ, కోశాధికారి ఇస్మాయిల్, అస్లాం, జమాతే ఇస్లాం హింద్ సభ్యులు మొహీద్దీన్, పట్టణ అధ్యక్షుడు షఫీవుల్లాహ్, అల్లాబకాష్, బాదుల్లాహ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అరెస్ట్ జగన్ పతనానికి నాంది

టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు



**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**
ఏడాది క్రితం అరాచకంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం రాష్ట్రంలో వైసిపి పతనానికి నాంది పలికిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. బాబు అరెస్ట్‌తో రాష్ట్రం యావత్తు ఆయన వెనుక కదిలిందని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు కసిగా పనిచేశాయని ఫలితమే జగన్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం జరిగిందని అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి టిడిపి కార్యకర్తకు ఇంటి పెద్దగా ఉన్న చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయడం ఎంతో మూర్ఖపు చర్యయో 2024సార్వత్రిక ఎన్నికలలో వైసిపికి తెలుసొచ్చిందని పేర్కొన్నారు. టిడిపి కార్యకర్తలు తలుచుకుంటే ఎంత దారుణమైన పరాజయం రుచి చూపించగలరో జగన్‌కు స్పష్టంగా తెలిసిందని, భవిష్యత్తులో కూడ ఆంధ్ర రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన తెలియ జేశారు. రాష్ట్రంలో విపత్తులు వచ్చినప్పుడు అధికార యంత్రాగాన్ని ఎలా వినియోగించుకోవాలో చంద్రబాబును చూస్తే అర్థమవుతుందని, టిడిపి అధినేత ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంటే సైకో జగన్‌రెడ్డి ప్రత్యర్థి పార్టీలను, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకే పనిచేస్తుంటారని ఆయన చేసే కుటీల రాజకీయాలకు భవిష్యత్తులో కూడ ఆంధ్రరాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ బాష, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శ కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ తుపాకుల అశోక్‌కుమార్, కౌన్సిలర్ రాజేష్, సర్పంచ్ కోటయ్య నాయుడు, 8వ వార్డు అధ్యక్షులు మన్నూరు పీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని నిమజ్జన వేడుకల్లో పోటాపోటీగా లడ్డూ వేలం

మేకవారిపల్లెలో 2.80లక్షలు పలికిన గణేష్ లడ్డు

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**



వినాయకుని నిమజ్జన వేడుకలు మూడవ రోజైన సోమవారం ఘణంగా జరిగాయి. వందలాది విగ్రహాలు పెన్నానదిలో నిమజ్జనానికి తరలివెళ్లాయి. స్థానికంగా చెరువుల్లోనూ, చెక్ డ్యాముల్లోను, అత్తిరాల మడుగు లోనూ నిర్వాహకులు నిమజ్జనం చేశారు. గణేష్ నిమజ్జనం సంధర్భంగా పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి పోటీలను ఏర్పాటుచేశారు. అదేవిధంగా వినాయకుని మండపాల్లో స్వామి చేతిలో ప్రసాదంగా ఏర్పాటుచేసిన లడ్డూ వేలం పాట గ్రామీణ ప్రాంతాల్లో పోటాపోటీగా పాడుతున్నారు. రాజంపేట మండలం మేకవారిలపల్లెలో బొట్టా నరసింహులు 2.80లక్షలకు వేలంపాటలో వినాయకుని లడ్డును కైవసం చేసుకున్నారు. ఆనందంతో నరసింహులు కుటుంబసభ్యులు ఊరేగింపుగా గ్రామంలో అందరికి పంచిపెట్టారు. అలాగే పలు చోట్ల లక్షలాది రూపాయలు లడ్డూలు వేలంలో భక్తులు పాడి దక్కించుకుంటున్నారు. కొల్లావారిపల్లెలో వినాయక నిమజ్జన వేడుకల్లో స్వర్ణా వెంకటయ్య 1.13లక్షలకు గణేష్ లడ్డును వేలంపాటలో దక్కించుకున్నాడు.

# ఎస్సై రమణయ్యను సన్మానించిన టీడీపీ నాయకులు



**తంబళ్లపల్లె, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండల నూతన తాత్కాలిక ఎస్సైగా కేవీ రమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మహిళా నేత సిద్దమ్మ, రాష్ట్ర టీడీపీ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, పురుషోత్తం తదితరులు ఎస్సై కేవీ రమణను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి సన్మానించారు. గత నెల 19న నిమ్మనపల్లె పీఎస్ నుంచి బదిలీపై వచ్చిన లోకేష్‌రెడ్డిని రాజంపేట డీఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి నిమజ్జనం కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయం పాటించి సహకరించాలని కోరారు.

# జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందండి

– ఎంపీడీవో సురేంద్రనాథ్

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లెలోని పీఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, డీడాప్ వారి ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాలలో నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్యతో కలిసి అధికారులతో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ డిప్లొమో, ఎంబీఏ, పీజీ విభాగాలకు చెందిన నిరుద్యోగ యువత 18-35 వయసు కలిగి బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా హాజరు కావాలని వారు కోరారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ పేరు పొందిన కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 9618655759 సంప్రదించాలని కోరారు.

# తంబళ్లపల్లె మండలంలో వినాయక నిమజ్జనాలు

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలో పలు పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాల్లో పలు చోట్ల సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం జోరుగా సాగింది. మధ్యాహ్నం నుంచే మండలంలోని పలు వినాయక విగ్రహాలకు భక్తులు పెద్దఎత్తున అర్చనలు, అభిషేకాలు, దూపదీప నైవేద్యాలు, కర్పూర హారతులు నిర్వహించారు. ప్రత్యేక వైద్య బృందాలు ప్రజలు రంగవల్లులు చల్లుకుంటూ వైభవంగా నిర్వహించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కేవీ రమణయ్య తన సిబ్బందితో పర్యవేక్షించారు.

## విజయ దుర్గా కాలనీలో ఘనంగా జరిగిన వినాయక నిమజ్జనం



**కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
కడప నగరంలోని విజయ దుర్గ కాలనీలోని 4వ రోడ్డులో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఘనంగా నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ, ప్రముఖులు గోవిందు నాగరాజు, ఆర్.సుధాకర్, ఏసీ కొండారెడ్డి, పల్లా రాధాకృష్ణ, సీఆర్ఐ సునీల్ జయంత్, సీఆర్ఐ పెద్ద సుబ్బరాయుడు, రాజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బన్న, గుత్తివేణు, రఘునాథ్ నాయుడు, విజయ దుర్గా కాలనీ వాసుల ప్రజలు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి బయలుదేరిన గణనాధుడు



**ఖాజీపేట, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి గణేష్ విగ్రహాలు పెద్దఎత్తున నిమజ్జనానికి సోమవారం నాడు బయలుదేరి వెళ్లాయి. అందులో భాగంగా బీసీ కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం మూడు రోజుల పాటు పూజలు అందుకొని మూడవ రోజు సోమవారం నాడు నిమజ్జనానికి స్వామి వారు బయలుదేరారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన లడ్డూ వేలంపాటలో 18వేల రూపాయలకు బీసీ కాలనీకి చెందిన గంగిరెడ్డి మధుసూధన్ రెడ్డి, కలశం చెంబును గంగిరెడ్డి రాజేష్ కుమార్ రెడ్డి(చిన్నా) అనే వ్యక్తులు సొంతం చేసుకున్నారు. డప్పు వాయుధ్యాల మధ్య యువత, మహిళలు నృత్యాలు చేస్తూ ఏకదంతుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. గణపతి పప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

# ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలు

**వీరబల్లి, సెప్టంబర్09,ప్రభాతవవార్త :**
మండలంలో సోమవరం పంచాయితీ వడ్డెపల్లె కు చెందిన వేముల వెంకటమ్మ ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెంకటమ్మ గత వారం రోజుల నుండి బ్రతుకు తెరువు కోసం బయట ప్రాంతంలో కూలి పనులకు వెల్లింది. దీనిని గమనించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడి అక్కడ మద్యం సేవించి చోరీకి పాల్పడ్డారు. బీరువాను పగులగొట్టి 25 వేల రూపాయలు నగదు, 5తులాల బంగారం తీసుకెళ్లినట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలుపగా వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి చుట్టుప్రక్కల వారిని విచారించడం జరిగింది. అంతేగాక క్లూస్ టీంను కూడా పిలపించి క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలం కేటాయించండి

**– తహసీల్దార్‌కు విన్నవించిన కమిటీ సభ్యులు**

**గాలివీడు, సెప్టెంబర్ 9(ప్రభాతవార్త):**



మండల కేంద్రంలోని స్థానిక పెద్దూరు బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భాగ్యలతను కలిసిన కమిటీ సభ్యులు దేవాలయంలో మౌలిక వసతుల కల్పనకై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో మరుగుదొడ్లు లేక భక్తులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాక అర్చకులు ఉండటానికి, వివాహాలు చేసుకునే సమయంలో వధూవరులు ఉండటానికి సరైన గదులు లేక ఇబ్బంది పడుతున్నందున తగిన స్థలం కేటాయిస్తే నిర్మాణం చేపడతామని తెలియజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ స్థల కేటాయింపును పరిశీలించాలని వీఆర్‌ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రిషికేశ్, హరిక్రిష్ణ, వీరారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృ మరణాలు శిశు మరణాలను అరికట్టండి

**డాక్టర్ జె.విజయ్ కుమార్**

**బద్వేల్,సెప్టంబర్09,ప్రభాతవవార్త :**

మండలంలోని హైరిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించండి అని మండల వైద్యాధికారులు డాక్టర్ జె.విజయ్ కుమార్, డాక్టర్ విశ్వంత్ లు తెలిపారు. సోమవారం వారు మండలంలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో జరిగిన ప్రధాన మంత్రి మాతృత్వ అభయాన్ సురక్షిత కార్యక్రమము నిర్వహించారు. ఈ సమావేశంలోవారు మాట్లాడుతూ మండలంలోని గర్భిణీ స్త్రీలు అందరికీ ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించి మరియు ముఖ్యంగా కష్టతరమైనటువంటి గర్భిణీ స్త్రీలను గుర్తించి 102,108 వాహనాలను ఉపయోగించుకొని సరైన సమయంలో సరైన చికిత్సను అందించవలసినదిగా సిబ్బందికి ఆదేశించారు. ఈదేవిధంగా సీజనల్ వ్యాధుల వ్యాధులు అయిన మలేరియా, డెంగీ, మొదలగు వ్యాధులు వస్తున్నందున పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకొని అలాగే పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే విలేజ్ క్లీనిక్ నందు ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి బోజనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గర్భిణిలకువారి ఆరోగ్య విషయమై చర్చించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంమలో హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కే.చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ కె వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మరియు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గర్భవతులకు హెల్త్ చెకప్

**యర్రగుంట్ల, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**



ప్రధానమంత్రి సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం చిలమకూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ శ్రీ చరిత రెడ్డి మరియు గణేష్ రెడ్డి నిర్వహించారు. ప్రతి నెల 9వ తేది హెల్త్ క్యాంప్ నిర్వహిస్తామని, పోషణ అభియాన్ సమతుల్య ఆహారం, తల్లిపాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ, బర్త్ ప్లానింగ్ గర్భవతులకు తగు జాగ్రత్తలు తెలిపారు. డెలివరీ కోసం గవర్నమెంట్ హాస్పిటల్‌కు రావాలని, కిల్కరీ కాల్స్ ప్రతి గర్భవతి వినాలని, మంచి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని అవగాహణ కలిగించారు. మోటుపల్లి కొండారెడ్డి అందరికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, సూపర్‌వైజర్ సుభద్ర, స్టాఫ్ నర్స్ జయలక్ష్మి, భారతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎస్సార్‌ఐటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**




సాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాడు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సంధర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో తోటి విధ్యార్ధుల పట్ల స్నేహ భావంతో మెలుగుతూ, మన కళాశాల నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో ఉన్నతమైన విద్యాబుద్ధులు నేర్చుకొని అందరూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ సంధర్బంగా సీనియర్ విధ్యార్ధులు జూనియర్ విధ్యార్ధులకు స్వాగతం పలుకుతూ మీరందరూ అధ్యాపకుట పట్ల గౌరవంగా నడుచుకుంటూ విద్యలో మీకు అవసరమైన సహాయాన్ని సీనియర్లతో షేర్ చేసుకొని కళాశాలకు గౌరవమును చాటాలి అని అన్నారు. కళాశాల చైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి ఫ్రెషర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విధ్యార్ధులు పాటలు, నృత్యాలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా కళాశాలలో సందడి వాతావరణం నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.వెంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ఊరేగింపుగా బయలుదేరిన గణనాధులు

**పుల్లంపేట, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**



మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని గణనాధులను సోమవారం ఊరేగింపుగా గణనాధులను నిమజ్జనానికి తరలించారు. మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ప్రజలు గణనాధులను పూజించి అనంతరం అన్న సంతర్పన కార్యక్రమాలను నిర్వహించి మధ్యాహ్నం నుంచి ఉట్టి కొట్టే కార్యక్రమాలతో పాటు గణనాధులు కోసం తయారుచేసిన ప్రత్యేక లడ్డులను వివిధ గ్రామాల్లో వేలంపాట కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలో నాగలపూర్ గట్టులో సుమారు 28వేల రూపాయలు పలికింది. చెర్లోపల్లి గ్రామంలోని గణనాధుడు లడ్డు 45,000 రూపాయలకు వేలంపాటలో భక్తులు దక్కించుకున్నారు. అనంతరం వివిధ రంగులతో కోలాహలంగా వైభవంగా గణనాధులను ట్రాక్టర్లపై ఎక్కించి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం గ్రామాల్లోని ప్రజలకు తీర్థ ప్రసాదాలను పంచుతూ ప్రతి ఇంటి దగ్గర గణనాధులకు టెంకాయలు కొట్టి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో భారీ ఎత్తున టపాసులు పేల్చుతూ రంగులు చల్లుకుంటూ అంగరంగ వైభవంగా గణనాధులను నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుల్లంపేట పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

## దౌర్జన్యంగా సాగులో ఉన్న భూమిని ఆక్రమించారు

**– రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి**

**జమ్మలమడుగు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**




జమ్మలమడుగు మండలం గడికోట కొట్టాలపల్లి గ్రామ సర్వే నెంబరు 579లో గత 12 సంవత్సరాల నుంచి 5 ఎకరాల 41 సెంట్లు భూమిని సాగు చేస్తూ జీవనం గడుపుతున్నామని, తమ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించారని బాధితురాలు రోటికాడి జయలక్ష్మీ, రామకృష్ణలు వాపోయారు. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గత 12 సంవత్సరాల క్రితం ప్రభుత్వం వారు ఇచ్చిన భూమిని కొండ గుట్టలను చదును చేసుకొని తయారు చేసుకున్నామన్నారు. గత కొన్ని నెలలుగా నా భర్త రామకృష్ణ అనారోగ్యం వలన కర్నూలు ఆసుపత్రిలో ఉండడంతో దీనిని ఆసరాగా తీసుకొని కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు వారు తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. దౌర్జన్యంగా తమ భూమి ఆక్రమించుకున్న వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, పోలీసు వవారు తక్షణమే తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నిమజ్జన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు భద్రత

**కామనూరు వంతెన వద్ద నిమజ్జన బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:**




ప్రొద్దుటూరు మండలంలోని కామనూరు కుందూ నది వంతెన వద్ద ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జన బందోబస్తును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం నాడు పరిశీలించారు. ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలంతో వినాయక నిమజ్జనం సంధర్బంగా ఏర్పాటుచేసిన బందోబస్తుపై చర్చించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సాధ్యమైనంత వరకు చీకటి పడకముందే వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిగేలా చూడాలని ఎస్పీ సూచించారు. నిమజ్జనానికి వెల్లే వాహణాల్లో చిన్న పిల్లలు, వృధ్ధులు, మహిళలు లేకుండా చూడాలన్నారు. మద్యం సేవించి నిమజ్జనం ఊరేగింపులో పాల్గొనకుండా పోలీసు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పోలీస్ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. కుందూ నదిలో నీరు ఎక్కువగా పారుతున్నందున నదిలోకి ఎవరూ వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కుందూ నది వద్ద గజ ఈతగాళ్లు, అగ్నిమాపక, రెస్క్యూ బృందాలను ఏర్పాటుచేశారు. జిల్లా ఎస్పీ వెంట డీఎస్పీతో పాటు రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంలో పంజం

**రైల్వేకోడూరు,సెప్టెంబర్ 9,ప్రభాతవార్త:**



రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఇందిరానగర్ లో గణపతి నిమజ్జనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వేకోడూరు వైసీపీ సీనియర్ నాయకులు పంజం సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ముఖ్యంగా రైల్వేకోడూరు ప్రజలను చల్లంగా చూడయ్యా అంటూ ప్రార్థనలు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.గణపతి పూజలో మండలంలో అన్నిచోట్ల జరుగుతున్నాయని శాంతి భద్రతలతో కట్టుదిట్టమైన పోలీసు భద్రతతో నిమజ్జన వేడుకలను చేయడం సంతోషంగా ఉందని అన్నారు.అదే విధంగా ప్రజలు కూడా ఘనంగా పూజలు చేయడం ఆనందాన్నిచ్చిందని సుకుమార్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ,మాజీ నీటి సంఘం అధ్యక్షులు పంజం వేణుగోపాల్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,శివ,మల్లీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

**చెన్నూరు,సెప్టంబర్09,ప్రభాతవవార్త :**



చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లును ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన ఆయనను కడప జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విధ్యాశాఖాధికారి వారి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం జరిగింది. ఈ ఉత్తమ ఉపాధ్యాయుడిని పాఠశాలలోని ఉపాధ్యాయులు సన్మాంచారు. ఈ కార్యక్రమమంలో ఆయన మాట్లాడుతూ తాను జిల్లాలో జరిగే ప్రతి చిత్రకళా పోటీలకు న్యాయ నిర్ణేతగా వెళ్లడం జరిగిందని అలాగే బాలోత్సవం, సోల్ ఎగ్జిబిషన్, గ్రూప్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మనాభం, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, సుబ్బయ్య, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

**కాశినాయన, సెప్టెంబరు 9 (ప్రభాతవార్త):**



మండంలోని పలు పంచాయతీలలో మూడవ రోజు సోమవారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం ఘనంగా జరిగింది. దాదాపు 30 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండలంలోని వరికుంట్ల, గొంటువారిపల్లె, ఆనంవారిపల్లె, రెడ్డికొట్టాల, నరసన్నపల్లె తదితర గ్రామాలలో విగ్రహాలను ఘనంగా ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనం వద్ద ఎలాంటి అసౌకార్యలు కలుగకుండా ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చేపట్టారు.

## వైభవంగా వెంకటయ్యనగర్‌లో వినాయక చవితి ఉత్సవాలు

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు9 (ప్రభాతవార్త):**



పట్టణంలోని వినాయక చవితి ఉత్సవాలు అధిక శాతం సోమవారం గణేశుని నిమజ్జనంతో ముగిసాయి. ఇందులో భాగంగా వెంకటయ్యనగర్, మేదరవీధులలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని రూ.75వేలకు వేలం పాట ద్వారా మేడం రఘురామ్ కుటుంబ సభ్యులు సొంతం చేసుకున్నారు. లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న వారికి వినాయక ఉత్సవ కమిటి వారు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి బ్యాండ్ మేళ తాళాలతో వారి ఇంటి వద్దకు తీసుకెళ్లారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి వార్డుబాట : ఎమ్మెల్యే

**మదనపల్లె, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**



పట్టణంలోని ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే వార్డుబాట నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. దేవళంవీధిలో ఇంటింటికి వెళ్ళి ప్రజాసమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా నీటిసరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ ఇతర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకొన్నారు. పిఅండ్‌టి కాలనీలో దొంగతనాలు అధికమయ్యాయన్న ఫిర్యాదుపై పోలీసుల గస్తీ పెంచుతామని తెలిపారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే విచారించి చోరీలు జరగకుండా అరికడుతామని పోలీసులు తెలిపారు. ఇందిరానగర్‌లో నీటిసమస్యపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి నీటిసరఫరా మెరుగు పరచాలని ఆదేశించారు. పెన్షన్‌లు రేషన్‌కార్డులు, ఇళ్ళస్థలాలు, కావాలని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రజాసమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. అధికారులు సచివాలయ సిబ్బంది ప్రజలతో సత్సంబందాలు కలిగి ఉండాలన్నారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాలి

**కడప కార్పొరేషన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని మాజీ కడప డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా పిలుపునిచ్చారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూ కడప నగరంలో మెయిల్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 25 కోట్ల మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో వ్యతిరేకించాలన్నారు. వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా 50లక్షల మెయిల్స్ పంపించాలన్నారు. ఈ మెయిల్స్ కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు ఉందని, ముస్లిం మత పెద్దలు, యువత ముస్లిం మైనార్టీలు మేలుకొని ప్రతి ఒక్కరూ ఈ మెయిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రిమ్స్‌లో అన్నదానం

**కడప కార్పొరేషన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

కడప రిమ్స్‌లో అనాథలకు, అభాగ్యులకు, నిరాశ్రయులకు అన్నదానం చేయడం మనసుకు తృప్తిని ఇస్తుందని బీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బీచు నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కడప రిమ్స్ జనరల్ ఆసుపత్రి నగరంలోని పలు కూడళ్లలో ఆధరణ లేని నిరుపేదలకు, వికలాంగులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్నారు. నిరాశ్రయుల వసతి గృహంలోని పేదలకు, అనాథ శరణాలయంలో, వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఎస్ఆర్ ఫౌండేషన్ వాలంటీర్లు, హరినారాయణరావు, శ్రీనివాసులురెడ్డి, హరి, నారాయణ, మహేష్ పాల్గొన్నారు.

## పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించవచ్చు : ఎంపీపీ

**వీరబల్లి,సెప్టంబర్09,ప్రభాతవవార్త :**



విద్యార్థుల్లో కృషి, పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చునని మండల వైసిపీ పార్టీ ఎంపీపీ గాలివీటి రాజేంద్ర నాథ రెడ్డి తెలిపారు. మండలంలో దిగువ రాచపల్లె పంచాయితీ లోని కళ్లేవాండ్లపల్లెకు చెందిన నాగరాజు అనే విద్యార్థి ఇటీవల నేపాల్ దేశంలో 74వ విభాగంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ లో 390 కేజీలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించాడు. అతని ప్రతిభను గమనించి విఆర్‌డియస్ స్వచ్చంద సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి ఆద్వర్యంలో స్థానిక యస్‌డికేఆర్ డిగ్రీ కళాశాలలో సన్మాన సభ కార్యక్రమము సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధిదిగా ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి హజరు కావడం జరిగింది. ఈ సందర్బంగా గోల్డ్ మెడల్ సాధించిన నాగరాజును శాలువాలతో పూల మాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చునని తెలిపారు. దానికి నిదర్శనమే ఈ నాగరాజు అని నాగరాజును ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకొని విద్యలో గానీ, ఆటల పోటీల్లో గానీ తమ ప్రతిభను కనబరచాలన్నారు. అటువంటి విద్యార్థులకు తమ వంతు సహయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి హజరైన పెద్దలు ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంమలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా, దిగువరాచపల్లి సర్పంచ్ రవి, స్థానిక వైసిపి సీనియర్ నాయకులు కుళాయి రెడ్డి, అధ్యాపకులు భాస్కర్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు పల్లం రామచంద్ర, లక్కిరెడ్డి పల్లె మండల తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమంగా తరలించినా, నిల్వ చేసిన చర్యలు తప్పవు

**– జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**రాయచోటి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**



జిల్లాలో ఇసుక అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా చట్టపరంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గనులు, రవాణాశాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, లారీ, టిప్పరు యజమానులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఇసుక సరఫరా అమలు విధానాన్ని, సరఫరా సందర్భంగా వాహన చోదకులకు ఏమైనా సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, వాహన యజమానులతో పలు అంశాలపై చర్చించారు. అక్రమంగా ఇసుకను తరలించడం, నిల్వ చేయడం నేరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి రవికుమార్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి భరత్, పోలీసు అధికారులు, ట్రాక్టరు, లారీ, టిప్పరు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

**లక్కిరెడ్డిపల్లె,సెప్టెంబర్ 09,ప్రభాతవార్త:**



మూడు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులను సోమవారం భక్తులు నిమజ్జనం చేశారు.ముందుగా పూజలు నిర్వహించి వాహనాల్లో వినాయకులను ఊరేగింపుగా తరలించారు.బూడిద గుంటపల్లి,సోమలమల్లపల్లి జిఎంఆర్ కాలనీ తదితర గ్రామాల్లో యువకులు రంగులు చల్లుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాల వెంకటేష్ ఆధ్వర్యంలో కోలాటం చెక్కభజనలు మధ్య నిమజ్జనంలో పాల్గొన్నారు.స్వామివారికి నైవేద్యంగా పెట్టిన లడ్డులను వేలం పాట నిర్వహించారు.డిఎస్పీ ఆదేశాల మేరకు సీఐ కొండారెడ్డి ఎస్సై రవీంద్ర పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## అమ్మవారిశాలలో ముగిసిన వినాయక చవితి వేడుకలు

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు9 (ప్రభాతవార్త):**



వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన వినాకునికి మూడు రోజుల పాటు వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించి సోమవారం స్వామివారి నిమజ్జనానికి తరలించారు. స్వామివారి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని రూ.10,800లతో పబ్బతి నరసింహులు సొంతం చేసుకున్నారు. అనంతరం స్వామివారి వద్ద ఉంచిన చెరకుగడలతో పాటు పలు సామాగ్రిణి పలువురు స్వంతం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు గుబ్బా వెంకసటుబ్బయ్య, సెక్రటరీ పైడిమర్రి సురేష్, చిందుకూరి శివకుమార్, పెసలసుధాకర్, సొల్లేటి సుబ్బరాజ, గ్రంధి నాగార్జున, భూపాళం రాఘవేంద్ర, దుద్యాల సత్యం, బార్గవ్, రాజేష్‌లతో పాటు పలువురు పాలొన్నారు.

## పెద్ద అగ్రహారంలో రూ.65వేలు పలికిన లడ్డు

**బద్వేలు, సెప్టెంబరు 9 (ప్రభాతవార్త):**



బద్వేలు మునిసిపాలిటీ పరిధి అగ్రహారంలో మూడు రోజులుపాటు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవంగా వివిద రకాల ప్రత్యేక పూజలను కన్నుల పండువగా నిర్వహించారు. మూడవ రోజు సోమవారం స్వామివారిని నిమజ్జనానికై పెద్దచెరువుకు ప్రత్యేక బ్యాండు మేళ తాళాలతో తరలించారు. స్వామివారి వద్ద మూడురోజులు పాటు నిర్వహించిన లడ్డు ప్రసాదాన్ని వేలం పాటద్వారా రూ.65వేలు దద్దం నాగార్జున కుటుంబసభ్యులు దక్కించుకున్నారు. అలాగే చిన్న అగ్రహారం గ్రామంలో వినాయకుని వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాన్ని రూ.16వేలకు దద్దం నాగేంద్ర కుటుంబ సభ్యులు వేలంపాట ద్వారా దక్కించుకుని వీరికి వినాయక ఉత్సవ కమిటి సభ్యులు స్వామివద్ద ప్రత్యేక పూజలు చేపట్టి ,శాలువాతో సత్కరించి బ్యాండు మేళాలతో వారి కుటుంబం వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన యూత్ నాయకులు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా వినాయక చవితి వేడుకలు

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 9 (ప్రభాతవార్త):**



పట్టణంలోని నెల్లూరురోడ్డులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఈవో రామలింగారెడ్డి , ఆలయ పూజారి రమేష్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామివారి వద్ద ఉంచిన లడ్డుప్రసాదాన్ని, చెరుకులను కొండారెడ్డి, కలశంను యర్రంరెడ్డి సొంతం చేసుకున్నారు. వారికి ట్రస్టీబోర్డు చైర్మన్ ఆలయ సిబ్బంది రాజు, సుబ్బయ్యలతో పాటు పలువురు స్వామివారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతి సత్యనారాయణ , జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, పిచ్చయ్యల, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఎస్పీ ఆరా..

**కడప క్రైం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

జిల్లాలోని చాపాడు, దువ్వూరు, బి.మఠం, కలసపాడు పరిధిలోని వినాయక నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బబారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్తు, అగ్నిమాపక శాఖాధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొని విధులు నిర్వర్తించాలన్నారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్,రూరల్ సీఐ శివ శంకర్, చాపాడు ఎస్సై చిన్న పెద్దయ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు.